క్లుప్తంగా

రైతులకు పెట్టుబడి సాయం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాసుదేవరావు

డెంకాడ: వైఎస్సార్ భరోసా– పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గురువారం పథకాన్ని ప్రారంభించగా..ఈ కార్యక్రమాన్ని మండలంలోని మోపాడ గ్రామ సచివాలయంలో వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వాసుదేవరావు, ఏటపూడి నిర్మల మాట్లాడుతూ, పథకం ద్వారా ప్రతి రైతుకూ రూ. 13,500 అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బడుకొండ రమేష్. తదితరులు పాల్గొన్నారు.

జ్యూస్ పంపిణీ


పాదచారులకు మ్యాంగో జ్యూస్ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

విజయనగరం: వాసవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు లాంతర్ల జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం 50 రోజులు పూర్తయిన సందర్భంగా పాదాచారులకు గురువారం మ్యాంగో జ్యూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు మండవిల్లి వెంకటరాజు మాట్లాడుతూ, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని.. వడగాల్పులు వీస్తున్నందున మజ్జిగ, మంచి నీరు, పండ్ల రసాలు తీసుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు వరకు బయట తిరగకూడదన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ చైర్మన్ మల్లికార్జునరావు, రవ్వ వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, కట్టమూరి రత్నారావు, రాంజీ, బొడా నానాజీ, గుంపిన నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ హోమ్‌కు కుర్చీల వితరణ


చిల్డ్రన్ హోమ్ చిన్నారులతో సంఘ సభ్యులు

విజయనగరం: డాక్టర్ పీవీజీ రాజు శత జయంతి ఉత్సవాలలో భాగంగా క్షత్రియ యూత్ పరిషత్, మహిళా పరిషత్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు క్షత్రియ యూత్ పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ఎన్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఒంపల్లిలోని రెయిన్‌బో చిల్డ్రన్ హోమ్‌లో చిన్నారులకు ఆహార పొట్లాలు, కుర్చీలు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో రాంబాబు శివాజీరాజు, రామరాజు, శేఖర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు చంద్రంపేటలో గడప గడపకు..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని చంద్రంపేట పంచాయతీలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భానోజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు పాల్గొంటారని పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా హరికృష్ణ

మెరకముడిదాం: మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా పీఆర్ ఏఈ హరికృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేసిన పి.రామకృష్ణ పదోన్నతిపై గుంటూరు జిల్లాకు వెళ్లారు. పూర్తిస్థాయిలో ఎంపీడీఓ నియమితులయ్యే వరకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా హరికృష్ణకు ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు.

గొల్లుపాలెంలో 'ఫ్యామిలీ డాక్టర్'


శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి ఝాన్సీ

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెంలో దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జె.ఝాన్సీ ఆధ్వర్యంలో గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్ర మం నిర్వహించారు. ముందుగా శిబిరం ఏర్పాటు చేసి ఓపీ(అవుట్ పేషెంట్) 92 మందికి సేవలు అందించారు. అయిదుగురు గర్భిణులకు వైద్యతనిఖీలు చేశారు. అనంతరం గృహసందర్శన చేసి ప్రజలకు వైద్యపరీక్షలు చేశారు. హెల్త్ సూపర్ వైజర్ బోధ నారాయణ అప్పలనాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కష్టాలకు చెక్..

- బీసీ కాలనీలో కనీస సౌకర్యాల ఏర్పాటు
- రూ. 27 లక్షలతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం
- 14 ఏళ్ల టీడీపీ పాలనలో పట్టించుకోని పాలకులు


బీసీ కాలనీలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణం

నెల్లిమర్ల: ఆ కాలనీ వాసులు దశాబ్దాలుగా పడుతున్న కష్టాలకు ఎట్టకేలకు చెక్ పడనుంది. కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఎన్నాళ్లగానో స్థానికులు మొరపెట్టుకున్నప్పటికీ గత పాలకులు పట్టించుకోలేదు. 14 ఏళ్ల పాటు పాలించిన టీడీపీ ప్రభుత్వంలో ఒక్క సీసీ రోడ్డుగాని, మురుగునీటి కాలువ గాని నిర్మించిన పాపానపోలేదు. దీంతో రాళ్లు తేలిన రహదారులు, రహదారి మధ్యలోనే నిలిచిపోయిన మురుగునీటితో అవస్థలు అనుభవించారు. ఆ కష్టాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. స్థానిక కౌన్సిలర్ చొరవతో కాలనీ అభివృద్ధికి ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలను నిర్మిస్తున్నారు. ఇదీ నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధిలోని 11వ వార్డు బీసీ కాలనీ పరిస్థితి వివరాల్లోకి వెళితే..

పట్టణంలోని తెలకలవీధికి ఎగువన ఉన్న బీసీ కాలనీ సుమారు మూడు దశాబ్దాల కిందట ఏర్పడింది. ఈ కాలనీలో నివసిస్తున్న కుటుంబాలన్నీ నిరుపేద కుటుంబాలే. కాలనీలోని ప్రధాన వీధితో పాటు అన్ని వీధుల్లోనూ రాళ్లుతేలిన మట్టిరోడ్లే దర్శనమిస్తాయి. వాడుకనీరు దిగువకు ప్రవహించడానికి గత ప్రభుత్వాలు కనీసం ఒక్క మురుగునీటి కాలువ కూడా నిర్మించలేదు. 14 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం చిన్నపాటి అభివృద్ధి పని కూడా ఇక్కడ చేపట్టలేదు. 2014 – 19 మధ్య కాలంలో సీసీ రోడ్లతో పాటు కాలువల నిర్మాణానికి నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ పనులు చేపట్టని పరిస్థితి నెలకొంది. దీంతో మంజూరైన నిధులు సైతం వెనక్కి మళ్లిన దుస్థితి దాపురించింది. కనీసం ప్రధాన వీధిలోనైనా సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికులు అప్పటి ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో స్థానిక కౌన్సిలర్ చిక్కాల సంతోష్‌కుమార్ చొరవతో బీసీ కాలనీ అభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేసింది.


సీసీ రోడ్డు నిర్మించనున్న కాలనీ ప్రధాన వీధి

11వ వార్డు మొత్తంమీద మొదటి విడతగా సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి ఎస్ఎఫ్‌సీ, ప్లాన్–నాన్ ప్లాన్, 15వ ఆర్థిక సంఘం, ఎస్సీఎస్టీ నిధులు రూ 27.2 లక్షలు మంజూరయ్యాయి. మంజూరైన నిధులతో తాజాగా అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ప్రధానవీధిలో సీసీ రోడ్డుతో పాటు మురుగునీటి కాలువ, కాలనీ నుంచి విజయనగరం–పాలకొండ రహదారిని కలుపుతూ సీసీ రోడ్డు, కాలువ నిర్మిస్తున్నారు. ఇవే గాకుండా 11 వార్డులో గాంధీ నగర్ కాలనీ గారి రాములమ్మ ఇంటి నుంచి దేవి గుడి కల్వర్టు వరకు రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు.. బోయవీధిలోని చనమల్లు వెంకటరమణ ఇంటి నుంచి తెడ్లాపు గురునాయుడు ఇంటి వరకు రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు.. పద్మశాలి వీధిలోని మీసాల రాజేశ్వరి ఇంటి నుంచి చిక్కాల అప్పారావు ఇంటివరకు రూ. 3.2 లక్షలతో సీసీ రోడ్డు పనులకు వర్క్ ఆర్డర్స్ మంజూరయ్యాయి. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనుల ప్రారంభానికి చొరవ చూపించిన కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

పూర్తిస్థాయిలో అభివృద్ధి



11వ వార్డులోని బీసీ కాలనీ ప్రజలు పడుతున్న కష్టాలు కళ్లారా చూశాను. గత పాలకులు ఈ ప్రాంతంలో ఒక్క సీసీ రోడ్డుగాని, కాలువ గాని నిర్మించలేదు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు చొరవతో వార్డులో అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ. 27.2 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాను. ఇప్పటికే బీసీ కాలనీలో మొదటి విడత పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన వీధుల్లో కూడా సీసీ రోడ్లు, కాలువ పనులకు నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తాను.

– చిక్కాల సంతోష్‌కుమార్, 11వ వార్డు కౌన్సిలర్

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు


టెక్కలి గ్రామంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను మహిళకు అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు


గడప గడపకు కార్యక్రమంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో అవినీతికి తావులేకుండా అర్హులైన లబ్ధిదారులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని టెక్కలి, తుమ్మలపేట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవినీతిరహిత పరిపాలనను అందిస్తున్నామన్నారు. గతంలో సంక్షేమ పథకాలు వర్తించాలంటే కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారని, జన్మభూమి కమిటీలకు లంచం ఇస్తే కాని పని జరిగేది కాదని గుర్తు చేశారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం నేరుగా ఇంటివద్దకే పథకాలు అందిస్తున్నామని చెప్పారు. డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయడమే కాకుండా ఆర్థికచేయూతను అందిస్తున్నామన్నారు. కోవిడ్ కష్టకాలంలో ప్రజలు ఇళ్లకే పరిమితమైతే ప్రజలకు ఏ కష్టం రాకుండా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కంటికి రెప్పలా కాపాడారని గుర్తు చేశారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు.

గడప గడపలో విశేష స్పందన

గడప గడపకు... కార్యక్రమానికి ఆయా గ్రామాల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఏ ఇంటికి వెళ్లినా జగన్‌బాబు మా దేవుడని...పది కాలాల పాటూ చల్లగా ఉండాలంటూ అవ్వా, తాతలు దీవెనెలు అందించడం కనిపించింది. మండుటెండను సైతం లెక్క చేయకుండా ప్రజలు స్వచ్ఛందంగా ఎమ్మెల్యే బడ్డుకొండ వెంట నడిచి జై జగన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, నాయకులు దంతులూరి గిరిబాబు, కర్రోతు వెంకటరమణ, వాల్లే అప్పలనాయుడు, మొయిద ఆదినారాయణ, రాజినాయుడు, నేతేటి అప్పలనాయుడు, సన్యాసప్పడు, లెంక గోవిందరావు, పీఏసీఎస్ చైర్మెన్ కోట్ల పైడినాయుడు, తహసీల్దార్ రమణరాజు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు తప్పనిసరి

- విద్యుత్‌శాఖ ఎస్ఈ నాగేశ్వరావు

విజయనగరం ఫోర్ట్:

విద్యుత్ పొదుపు చేయడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని విద్యుత్ శాఖ ఎస్ఈ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సింగ్‌పూర్ సిటీ అపార్ట్‌మెంట్‌లో 'పొదుపు చేయండి – పర్యావరణాన్ని కాపాడండి' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, విద్యుత్ నిత్య జీవితంలో భాగమైందన్నారు. విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపు పాటించాలని సూచించారు. భవిష్యత్ తరాల వారికి మెరుగైన సమాజాన్ని అందించాలంటే ఇప్పటి నుంచే పిల్లలకు పొదుపుపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అపార్ట్‌మెంట్ వాసులతో విద్యుత్ పొదుపు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, టెక్నికల్ డీఈ ధర్మరాజు, ఎ.డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ పొదుపుపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఈ నాగేశ్వరరావు

మున్సిపల్ ఉద్యోగుల హామీలు నెరవేర్చాలి

నెల్లిమర్ల:

మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. హామీల అమలు కోసం ప్రారంభించిన రాష్ట్ర జీపుజాతా కార్యక్రమం గురువారం స్థానిక నగర ప్రంచాయతీ కార్యాలయం వద్దకు చేరింది. ఈ సందర్భంగా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్, తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. అలాగే సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీపుజాతాలో యూనియన్ నాయకులు బంగారు వరలక్ష్మి, జి. లక్ష్మి, జ్యోతి, భాను, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. శంకరరావు, కె. సురేష్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ బి. సుధారాణి పాల్గొన్నారు.


జీపుజాతాలో పాల్గొన్న నాయకులు

నిబంధనల ప్రకారం పనిచేస్తే గరిష్ట వేతనం

మెరకముడిదాం: నిబంధనల ప్రకారం ఉపాధి హామీ పనులు చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం రూ.272 అందు తుందని ఉపాధి హామీ ఏపీఓ ఎస్.పెదఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని సోమలింగాపురం, బుధరాయవలస గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను గురువారం పరిశీలించారు. వేతనదారులతో ఆయన మాట్లాడుతూ రెండుపూటలా పనులకు హాజరు కావాలని సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమచికిత్స కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని, నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు పైడిరాజు, ఆదినారాయణ ఉన్నారు.


వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీఓ పెదఅప్పలనాయుడు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గజపతినగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఎస్.కృష్ణమూర్తి గురువారం ఓ ప్రకటన లో తెలిపారు. విద్యుత్ తీగలకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. గజపతినగరంతో పాటు పురిటి పెంట, ఎం.వెంకటాపురం, మదుపాడ డెయిరి, ఎస్.జి.ఆర్.పురం లేఅవుట్ ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు

కొత్తవలస: డెక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాలకు స్థానిక వాగ్దేవి పీజీ, డిగ్రీ కళాశాలలో గురువారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 70 మంది యువకులు హాజరయ్యారని కళాశాల కరస్పాండెంట్ కె.మహేశ్వరరావు తెలిపారు.

క్రీడాకారిణికి అభినందనలు

శృంగవరపుకోట: రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీల్లో సత్తా చాటిన ఎస్.కోట క్రీడాకారిణి బుత్తల నీలిమను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు గురువారం అభినందించారు. మే 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు చిత్తూరు జిల్లా తిరుపతిలో నిర్వహించిన సీఎం కప్ మహిళల ఆహ్వాన కబడ్డీ పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు ద్వితీ య స్థానంలో నిలిచిందని, 20,21 తేదీల్లో నిర్వహించిన అండర్–19 స్కూల్‌గేమ్స్‌లో జిల్లా జట్టు తృతీయ స్థానం కైవసం చేసుకున్నట్లు కోచ్ తాతబాబు వివరించారు. ఈరెండు విజయాల్లో కీలక పాత్ర పోషించిన స్థానిక కబడ్డీ క్రీడాకారిణి నీలిమను ఎమ్మెల్సీ రఘురాజు అభినందిస్తూ.. మరింత సాధనచేయాలని, ఆటను వదిలేయవద్దని, జట్టుకు మరిన్ని విజయాలు అందించటంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఎటువంటి సహాయం కావాలన్నా తన సహకారం ఉంటుందని చెప్పారు.


క్రీడాకారిణి నీలిమను అభినందిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

రాజాం చేరిన ప్రచార జాతా ర్యాలీ

రాజాం సిటీ: మున్సిపల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన రాష్ట్ర ప్రచార జాత ర్యాలీ గురువారం రాజాం చేరుకుంది. మున్సిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని, 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, టైంస్కేల్ వర్తింపజేయాలని, పట్టణాల విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచాలని, రక్షణ భద్రతా సదుపాయాలు, పనిముట్లు సకాలంలో కల్పించాలని కోరారు. అనంతరం మెయిన్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించి, హక్కుల సాధనకు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీహెచ్ రామ్మూర్తినాయుడు, రాజేష్, గిరి, కనకరాజు, చిన్నబాబు, దొరబాబు, హరి, శారద, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో మున్సిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు, మున్సిపల్ కార్మికులు

నిర్దేశిత లక్ష్యాలు చేరుకోవాలి


ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం సిటీ: మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు సంబంధించి, నిర్దేశిత లక్ష్యాలు చేరుకోవాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు తెలిపారు. గురువారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన మండలంలో ప్రతిరోజూ 9 వేల మందికి పైగా పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు శతశాతం పని కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవనాలకు సంబంధించి, 30 ఎకరాలు లక్ష్యం కాగా 11 ఎకరాల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయని, మిగిలిన లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అమృత్ సరోవర్ చెరువులను గ్రామస్తుల సహకారంతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

రూ.2.80 లక్షలతో రోడ్డు నిర్మాణం

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులు రూ.2.80 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. బీటీ రోడ్డు నుంచి శ్మశానం వరకు ఈ రోడ్డు పనులు జరుగుతుండగా, గురువారం ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని ఆయన సూచించారు.

బాల్య వివాహాలు అరికట్టకపోతే ఎలా..?

- ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మండల పరిషత్ అధ్యక్షురాలు ఉప్పాడ అనూషారెడ్డి

భోగాపురం: మండలంలో జరుగుతున్న బాల్య వివాహాలను ఆరికట్టకపోతే ఎలా అని ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి సీడీపీఓ ఎస్తేరురాణిని ప్రశ్నించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బాల్య వివాహాల్లో మన మండలం జిల్లాలో ఐదో స్థానంలో నిలవడం బాధాకరమన్నారు. చిన్న వయసులో వివాహాలు జరగడం వల్ల ఎన్నో అనర్థాలున్నాయని, వాటిని బాలికలు, తల్లిదండ్రులకు వివరించి బాల్య వివాహాలను నిర్మూలించాలని సూచించారు. ఇక మీదట మండలంలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినట్లయితే సంబంధిత కమిటీ సభ్యులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని సీడీపీఓ ఎస్తేరురాణిని హెచ్చరించారు. హాస్టల్ విద్యార్థులు గంజాయి, గుట్కా వంటి చెడు వ్యసనాల బారిన పడుతుంటే మీరే ఏం చేస్తున్నారంటూ రావాడ హాస్టల్ వార్డెన్ అప్పలనాయుడిని ప్రశ్నించారు. విద్యార్థులపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. ప్రస్తుత వేసవికాలంలో మండల పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వైకుంఠరావును ఆదేశించారు. మండలంలోని కొన్ని పంచాయతీల్లో లోఓల్టేజీ సమస్య వేధిస్తోందని, అవసరమైనమేర ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి ఇబ్బంది లేకుండా చూడాలని విద్యుత్ శాఖ ఏఈ జ్ఞానేశ్వరరావుకు సూచించారు. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు వెంటనే బిల్లులు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని సూచించారు. మండలంలో చేపట్టాల్సిన అత్యవసర పనుల నిమిత్తం సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎంపీపీ గ్రాంట్ ద్వారా రూ. కోటి, ఫిఫ్టీన్ ఫైనాన్స్ ద్వారా రూ.60 లక్షల నిధులు మంజూరు చేశారని చెప్పారు. వీటిని మండలంలో ఉన్న ఎంపీటీసీ సభ్యులకు ఒక్కొక్కరికీ రూ.10 లక్షలు, వైస్ ఎంపీపీలకు రూ.20 లక్షలు చొప్పున కేటాయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ పడాల సత్యవతి, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, తహసీల్దార్ ఎస్. శ్రీనివాసరావు, హౌసింగ్ డీఈ మురళి, సీఎస్‌డీటీ మురళి, వివిధ శాఖల అధికారులు, ఎంపీపీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

జామి: మండలంలోని భీమసింగి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రసాదవితరణ చేశారు. కల్యాణ వేడుకల్లో భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ ఎండీ విక్టర్‌రాజ్, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సతీమణి, దేవీ అనూరాధ, జెడ్పీటీసీ గొర్లె సరయు, పాలక వర్గం సభ్యులు ఎన్నింటి ఆదిలక్ష్మి దంపతులు, పాండ్రంకి సంజీవి, తోట మధుసూదనరావు, ఎంపీటీసీ కంది పద్మావతి తదితరులు పాల్గొన్నారు. గురువారం ఉదయం సుప్రభాతం, ఆరాధన, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.